ఆస్పత్రులను వేధిస్తున్న సిబ్బంది కొరత

- పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో అందని వైద్య సేవలు
- అత్యవసరమైతే అవస్థలు పడాల్సిందే
- పట్టించుకోని కూటమి పాలకులు
- వైఎస్సార్ సీపీ హయాంలో రోగులకు అత్యుత్తమ సేవలు



సిబ్బంది లేక రాత్రివేళ నిర్మానుష్యంగా ఉన్న అంగర పీహెచ్‌సీ హాల్

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ సమస్యలు తిష్ట వేశాయి. సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. రాత్రి వేళ ఆసుపత్రికి వెళితే నిర్మానుష్యం నెలకొని పలకరించేందుకు ఒక్కరు కూడా కనిపించని దుస్థితి. ప్రస్తుతం విధుల్లో ఉన్న సిబ్బందికి పనిని కేటాయించగా వారు పగలు మాత్రమే సేవలందించగలుగుతున్నారు. రాత్రివేళ విధులు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో పూర్తి స్థాయిలో ఆరోగ్య సేవలు అందడం లేదు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ, వైద్యాధికారులు తమ ఆసుపత్రికి సిబ్బంది కావాలని ప్రతిపాదనలు పంపినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకూ స్పందించలేదు. మండలంలోని ఇతర పీహెచ్‌సీల్లోనూ సిబ్బంది సమస్య వేధిస్తోంది. 2019 నుంచి 2024 వరకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఆసుపత్రికి ఇద్దరు వైద్యులను నియమించి ఇంటింటికీ వైద్య సేవలను అందించేవారు. ప్రభుత్వం మారింది పీహెచ్‌సీ తీరు మారింది.

నియోజకవర్గంలో పీహెచ్‌సీలు ఇలా...

నియోజకవర్గంలోని మండపేట పట్టణంలో రెండు అర్బన్ పీహెచ్‌సీలు, కేశవరం, ద్వారపూడిలో, కపిలేశ్వరపురం మండలంలో అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప, రాయవరం మండలంలో మాచవరం, రాయవరం పీహెచ్‌సీలున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో ద్రాక్షారామ, వెల్ల, గొల్లపాలెం, దుగ్గుదూరు, పామర్రు, శేరిలంక, దంగేరు, పేకేరు, కుందూరు పీహెచ్‌సీలున్నాయి.

పట్టిపీడిస్తున్న సిబ్బంది సమస్య

మండపేట నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది సమస్య పట్టి పీడిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యులను నియమించింది. ప్రభుత్వం మారిన అనంతరం వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం అంగర పీహెచ్‌సీలో మూడేళ్లగా ఒక్క వైద్యురాలు మాత్రమే సేవలందిస్తున్నారు. మరో వైద్యురాలు రామచంద్రపురం అర్బన్ పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై నియమించారు. ముగ్గురు ఫార్మాసిస్టులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇద్దరు విధులు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఒక్క ఫార్మాసిస్టు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాకతిప్ప పీహెచ్‌సీలు నెలలు తరబడి ఒక్క వైద్యుడు మాత్రమే సేవలందిస్తున్నారు. ఇటీవల రెండో వైద్యుడి పోస్టును భర్తీ చేశారు. ఇక్కడ ముగ్గురు సూపర్‌వైజర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. అచ్యుతాపురం పీహెచ్‌సీని ఇద్దరు సూపర్‌వైజర్లతో నెట్టుకొస్తున్నారు.



అంగర పీహెచ్‌సీలో రాత్రి వేళ మూతపడిన పలు విభాగాల గదులు

గతంలో ప్రతి వ్యక్తికీ ప్రత్యేక ఓపీ షీట్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలందరికీ నాణ్యమైన వైద్యసేవలందేవి. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యులుండేవారు. క్షేత్రస్థాయిలోని వైద్య ఆరోగ్య కార్యకర్తలు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలను ఆరా తీసేవారు. వ్యక్తి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు రక్తపోటు, సుగర్, యూరిన్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలను చేసేవారు. వాటి వివరాలను జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు చేసి తర్వాత షెడ్యూల్ ప్రకారం నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాల్లో సేవలు పొందేందుకు టోకెన్‌లను జారీ చేసి నాణ్యమైన చికిత్సనందించేవారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అంగర పీహెచ్‌సీకి రాత్రివేళ అత్యవసర పరిస్థితుల్లో వెళితే కనీసం పలకరించేందుకు సిబ్బంది లేని పరిస్థితి నెలకొంది. ప్రజారోగ్యం క్షీణించడంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీ వద్ద రాత్రివేళ అవస్థలు



అంగర పీహెచ్‌సీ రాత్రివేళ మూతపడుతుంది. మేజర్ పంచాయతీగా ఉన్న అంగర గ్రామంతోపాటు పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు ఆసుపత్రిపై ఆధారపడుతున్నారు. ఇద్దరు వైద్యులను, ఇతర సిబ్బందిని నియమించాలి.

– పాలింగి శ్రీనివాస్, పడమర ఖండ్రిక

టీడీపీ పాలనలో మద్యం మాఫియాదే రాజ్యం

పిల్లి సూర్యప్రకాశ్



పిల్లి సూర్యప్రకాశ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

రామచంద్రపురం రూరల్: గతంలో 2014–2019 సంవత్సరంలోనూ ప్రస్తుతం టీడీపీ పాలనలోనే మద్యం మాఫియా రాజ్యమేలిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవాలను దాచిపెట్టి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ శాఖతో కానీ, లిక్కర్ పాలసీలతో కానీ ఏ మాత్రం సంబంధం లేని ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం రాజకీయ కుట్ర, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న చర్య అని అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. 2014–19 టీడీపీ పాలనలో 4,380 లిక్కర్ షాపులు, 43,000 బెల్టు షాపులు, పర్మిట్ రూంలు అన్నీ ప్రైవేటు మాఫియాలకు అప్పగించారన్నారు. ప్రివిలేజ్ ఫీజు రద్దుతో రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.1300 కోట్లు నష్టం జరుగుతుందని కాగ్ నివేదిక చెబుతోందన్నారు. 2019–24 వైఎస్సార్ సీపీ పాలనలో 43,000 బెల్టు షాపులను మూసివేసిందన్నారు. లిక్కర్ ఔట్‌లెట్లను 4,380 నుంచి 2,934కి తగ్గించిందని, మద్యం వాల్యూమ్ తగ్గినా మందు నుంచి రాష్ట్ర ఆదాయం రూ.16,912 కోట్ల నుంచి రూ. 24,760 కోట్లకు పెరిగిందన్నారు. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) లాంటి దేశంలోని అగ్రస్థాయి పోటీ నియంత్రణ సంస్థ వైఎస్సార్ సీపీ పాలనలోని లిక్కర్ పాలసీని సమర్థవంతమైన, పారదర్శకమైన, ప్రజా ప్రయోజనాలకు అనుగుణమైందని ధ్రువీకరించిందన్నారు. వైఎస్సార్ సీపీ తీసుకుని వచ్చిన మంచి పాలసీని నాశనం చేయడానికి, 2014–19 కాలంలో తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి మిథున్‌రెడ్డి అరెస్ట్ కుట్రకు తెరలేపిందన్నారు. వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందని, మిథున్‌రెడ్డికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ తెలిపారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మండపేటలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ సమావేశం



మండపేటలో కూటమి మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): కూటమి ప్రభుత్వం పూర్తిగా పాలనలో విఫలమైందని చెందిందని, ఆ విషయం సామాన్య ప్రజలకు సైతం అర్థమవుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. మండపేటలోని విజయలక్ష్మి నగర్‌లో సోమవారం ఆయన ఆధ్వర్యంలో మండపేట పట్టణం, రూరల్ మండలం పరిధిలో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణం, రూరల్ మండలాల సీనియర్ నాయకులు పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, సీనియర్ నాయకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు, జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు కురుపూడి రాంబాబు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ హాజరయ్యారు.

బొత్స వ్యాఖ్యలపై కూటమి నేతలకు ఉలుకెందుకు?

ఈ నెల 18న మండపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమంలో తమ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, శాసన మండలి కౌన్సిల్ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్పందించిన తీరు విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి లోకేష్, ఇతర మంత్రులు కౌన్సిల్‌లో స్వయంగా చేసిన వ్యాఖ్యలనే బొత్స మండపేట సమావేశంలో ప్రస్తావించారన్నారు. వాటికి సమాధానం చెప్పలేని ఎమ్మెల్యే వేగుళ్ల అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. తాము కౌన్సిల్‌లో అడిగిన ప్రశ్నకు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సమాధానం చెబుతూ గత ప్రభుత్వంలో కంటే ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లు తక్కువన్న సంగతిని స్పష్టం చేశారన్నారు. గ్యాస్ సిలిండర్ పథకంపై ప్రశ్నించడంతో సివిల్ సప్లై అధికారులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే వేగుళ్ల హడావిడి చేస్తున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి కూటమి హామీ ప్రకారం ఏడాదికి రూ.36 వేలు బకాయి పడిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇస్తూ ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పెట్టుబడులు తీసుకొస్తున్నామని, సంపదను సృష్టిస్తున్నామంటూ కూటమి నేతలు హడావిడి చేస్తుండగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు మాత్రం ఏపీ ఆర్థిక పరిస్థితి బాలేదంటున్నాయన్నారు. జీఎస్టీ చెల్లింపులు తగ్గడమే ఇందుకు నిదర్శనమన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదలకు మేలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అప్పులు చేస్తోందంటూ అప్పటి ప్రతిపక్ష నాయకులు ఎద్దేవా చేసేవారని ఇప్పుడు అదే నాయకులు మితిమీరిన అప్పులు చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో చేసిన సుమారు 2.70 లక్షల కోట్ల అప్పులు నేరుగా సామాన్యుల బ్యాంక్ ఖాతాలకు సంక్షేమం పేరుతో పారదర్శకంగా చేరాయన్నారు. ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అప్పు చేసి తెచ్చిన 1.70 లక్షల కోట్ల సొమ్ము కూటమి నేతలు, సంపన్నులకు మళ్లిందన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పాలనలో ఆక్రమణలు

మండపేట మున్సిపల్ స్థలాలు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాలనా తీరు వల్ల ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. బైపాస్ రోడ్డు సప్తగిరి థియేటర్ సమీపంలో సుమారు రూ.4కోట్లు విలువైన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి కబ్జా చేయగా గత ప్రభుత్వ హయాంలో తాను సర్వే చేయించి స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించానన్నారు. ప్రభుత్వం మారడంతో అదే స్థలం మరోసారి ఆక్రమణకు గురైందన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల ప్రోద్బలం లేకుండా స్థలం ఆక్రమణకు గురవుతుందని తాను అనుకోవడంలేదన్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో మద్యం షాపును తొలగించాలంటూ కౌన్సిల్‌లో తీర్మానం చేసారని, కూటమి ప్రభుత్వం ఏమాత్రం తీర్మానాన్ని పట్టించుకోకుండా అదే ప్రదేశంలో రెండో మద్యం షాపును ఏర్పాటు చేయడం ఎమ్మెల్యే వేగుళ్ల పాలనను అద్దంపడుతుందని ఎమ్మెల్సీ తోట అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చొరవతో పనిచేయాలన్నారు. కూటమి మేనిఫెస్టోను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ క్యూఆర్ కోడ్ చార్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో అన్నందేవుల కృష్ణ, సాధనాల శివభగవాన్, పలివెల సుధాకర్, పలుకూరి వెంకన్నబాబు, పోతుల ప్రసాద్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కపిలేశ్వరపురం (మండపేట): మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడిని సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ అన్నారు. మారేడుపాకలో సోమవారం ముమ్మిడివరం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఖరీఫ్ 2025 పథకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. మండపేట వ్యవసాయాధికారి కె.ప్రభాకర్ పర్యవేక్షణలో నిర్వహించిన సదస్సులో ఖరీఫ్ పంటలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం శాస్త్రీయ పద్ధతిలో ఉండాలన్నారు. ఏఓ కె. ప్రభాకర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాలో పేర్లు లేనివారు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రంలో సాంకేతిక సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, ఎంపీటీసీ సభ్యుడు పసలపూడి శ్రీనివాస్, నీటి సంఘం ఉపాధ్యక్షుడు ముత్యాల అన్నవరం, వ్యవసాయ విస్తరణాధికారి వనుం బాలకృష్ణ రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రసన్నాంజనేయస్వామి సప్తాహ ఉత్సవాలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో 49 రోజుల(సప్త సప్తాహం) పాటు నిర్వహించిన శ్రీరామ నామ సప్త సప్తాహ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను దంపతుల చేతుల మీదుగా ఆలయ అర్చకులచే పూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఉష్ట్ర వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, చింతూరు ఆదివాసీ గిరిజన కోయ డ్యాన్స్, సీతారాముల వేషధారణ, ఆంజనేయస్వామి వేషధారణలతో ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



ద్రాక్షారామ ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న డీవైఈఓ మూర్తి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని బాలికల ఇంటర్ ప్లస్ కళాశాల విద్యార్థినులు 60 మందికి పాఠశాల ఉపాధ్యాయిని వాడ్రేవు రత్న ప్రభావతి సమకూర్చిన యూనిఫాంలను రామచంద్రపురం ఉప విద్యాశాఖ అధికారి పీఆర్ఎల్ మూర్తి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఈఓ మూర్తి మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదువుకుని తమ కాళ్లపై తాము నిలబడేలా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శేఖర్ మాట్లాడుతూ ద్రాక్షారామలో ఇంటర్ ప్లస్ మంచి ఫలితాలు సాధించి జిల్లాలో రికార్డు సృష్టించిందన్నారు. అనంతరం డీవైఈఓ మూర్తిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి, స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు, ఉపాధ్యాయులు ఉమాపతి, పిల్లి రాంబాబు, కోడి ప్రసాద్, శ్రీనివాస్, దేవి, గాయత్రి, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలి

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ సోమవారం డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం రామచంద్రపురం తాలూకా కమిటీ ఎన్నిక రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రామచంద్రపురం తాలూకా సంఘం అధ్యక్షుడిగా కొమ్మల సోమనాయుడు(రెవెన్యూ శాఖ), కార్యదర్శిగా ఎం.శ్రీమన్నారాయణ(వైద్య శాఖ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎంఎస్ సుబ్బలక్ష్మి(సీటీఓ), ఉపాధ్యక్షులుగా ఐఏ సుబ్బలక్ష్మి(స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ), ఎన్.కరుణమ్మ(ఏఎన్ఎం), సంయుక్త కార్యదర్శులుగా తణుకు వెంకట్రావు(వీఆర్ఓ), పిండిప్రోలు సాయి ప్రతిమ(వీఆర్ఓ), మాగాపు భద్రరావు(వీఆర్ఓ), కోశాధికారిగా కేవీ సత్యనారాయణ(ఎక్సైజ్ శాఖ)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీడీపీఓ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీ

రామచంద్రపురం: ఫేస్ యాప్ పేరుతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులను ఇబ్బందుల పాలు చేస్తోందంటూ రామచంద్రపురం సీడీపీఓ కార్యాలయాన్ని మండలంలోని లబ్ధిదారులు సోమవారం ముట్టడించారు. ఫేస్ యాప్ వల్ల సరిగా యాప్ పని చేయకపోవడంతో ఏ పనీ చేయండా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలను ప్రభుత్వం ఇలా ముప్పుతిప్పలు పెట్టడం సరికాదని మండి పడుతున్నారు. గతంలో మాదిరిగా సంతకాలు పెట్టించుకుని సరకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటరత్నం, విజయలక్ష్మి, సూర్యకుమారి, జహరా, లక్ష్మీరత్నం, చంద్రకళ, మౌనిక పాల్గొన్నారు.

ట్రస్టు భూములు స్వాధీనం



భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రామచంద్రపురం: రామచంద్రపురం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన రూ.1.5 కోట్లు విలువైన 0.45 ఎకరాల భూమిని దేవదాయ శాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దేవదాయ శాఖ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రామచంద్రపురం పట్టణంలో ఆక్రమణలో ఉన్న స్థలాన్ని జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బాలాజీ రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో వివిధ ఆలయాల ఈఓలు జె.భీమశంకరం, వైవీవీ సత్యనారాయణ, వి.బాలకృష్ణ, వి.శ్రీనివాస్, ఆలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

కపిలేశ్వరపురం (మండపేట): ఏడిదలోని విక్రమ్ మద్యం దుకాణంలోకి ఈ నెల 20న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి సిబ్బంది దుకాణాన్ని మూసివేసి వెళ్లారు. సోమవారం ఉదయం దుకాణాన్ని తెరవగా కౌంటర్‌లోని రూ.3,50,000 చోరీకి గురైనట్టు గుర్తించారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి, రూరల్ ఎస్సై పి.దొరరాజు, ఎస్సై వి.కిశోర్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. అమలాపురం క్లూస్ టీం సభ్యులు ఆధారాలను సేకరిస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: ఉపాధి కోసం వెళ్లి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కందులపాలెం గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శాకా శ్రీనివాసు(40) కుటుంబం ఉపాధి కోసం 4 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లారు. బాచుపల్లి సమీపంలోని ప్రశాంతి నగర్‌లో ఒక ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం వేరే ఇంటికి పని కోసం వెళ్లి ఇనుప రేకులు మొదటి అంతస్తు నుంచి రెండో అంతస్తుకు చేరవేస్తుండగా కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు జోకాబ్ ఫిర్యాదుతో బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారని బంధువులు తెలిపారు. కందులపాలెంలో సోమవారం అతడి అంత్యక్రియలు నిర్వహించారు

ఎఫ్ఆర్ఎస్ యాప్ నిర్వహణ రద్దు చేయాలి



కపిలేశ్వరపురంలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాతా శిశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా తమకు అందించే పౌష్టికాహారం పంపిణీకి రూపొందించిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని మహిళలు ధర్నా చేశారు. ఈ యాప్ తమ విధి నిర్వహణలో పని భారాన్ని పెంచుతుందని అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలు, లబ్ధిదారులు సోమవారం కపిలేశ్వరపురంలోని ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తాము నివసిస్తున్న ప్రదేశంలో నెట్ సిగ్నల్ లేక యాప్‌లో నమోదు కష్టంగా మారుతోందన్నారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణలో భాగంగా తాము క్షేత్రస్థాయిలో విశేష సేవలందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఐసీడీఎస్ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం రూపొందించిన యాప్‌లతో తమపై పనిభారం పడుతుందన్నారు. ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో ఆలోచన చేసి మాతా, శిశు ఆరోగ్య రక్షణకు అంగన్‌వాడీలను వినియోగించుకునేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

కపిలేశ్వరపురం (మండపేట): ఇప్పనపాడులో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుని కుమారుడు వాకాడ సతీష్ ఫిర్యాదు చేయడంతో మండపేట రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆదివారం తహసీల్దార్ పి.తేజేశ్వరరావు సమక్షంలో ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేశారు. రూరల్ సీఐ దొరరాజు సోమవారం తెలిపిన కథనం ప్రకారం... వాకాడ వీర్రాజు (47) రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్ నుంచి మండపేటకు వస్త్రాలను తరలించే ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుమార్తె తన భర్తకు దూరమై తల్లిదండ్రులు వద్ద ఉంటోంది. వీర్రాజు తరచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. వీర్రాజు ఈ నెల 18న ఉదయం నిద్ర లేవలేదు. తన భర్త గుండెపోటుతో మృతి చెందినట్టు బంధువులకు భార్య చెప్పడంతో అదేరోజు అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి సెల్‌ఫోన్ సంభాషణలను విన్న కుమారుడు సతీష్ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించాడు. తండ్రిని గొంతునొక్కినట్టు తల్లిపై అనుమానం వ్యక్తం చేస్తూ మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఖననం చేసిన వీర్రాజు మృతదేహానికి 20న పోస్టుమార్టం చేశారు. రిపోర్టు వచ్చిన తర్వాత తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ దొరరాజు తెలిపారు.

నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ

రామచంద్రపురం: నిరుద్యోగ యువతీ యువకులకు ఆఫీస్ అసిస్టెంట్ కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ అందించనున్నట్టు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.హరి శేషు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రామచంద్రపురంలోని శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్ హబ్ వద్ద ఈ శిక్షణ అందించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి ప్రారంభించనున్న ఈ కోర్సులో చేరి పదో తరగతి ఆపై ఉత్తీర్ణులైన యువతీ యువకులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. మరింత సమాచారం కోసం కోఆర్డినేటర్ ఆర్. రఘు వర్మ 99484 04165 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కపిలేశ్వరపురం: టేకిలోని శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 12న ప్రారంభమైన ఉత్సవాలు గ్రామానికి చెందిన భక్తులు సహకారంతో ఘనంగా ముగిశాయి. అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాతసేవ, లఘు అర్చన, విశేష నివేదన, నవనీత హారతి, శ్రీపుష్పయాగ పూజలు చేశారు.

రాష్ట్ర దేవాంగ పురోహిత్ పరిషత్ ఉపాధ్యక్షుడిగా కొలువుల



కొలువుల మల్లికార్జునరావు

కపిలేశ్వరపురం: ఆంధ్రప్రదేశ్ దేవాంగ పురోహిత్ పరిషత్ ఉపాధ్యక్షుడిగా అంగర గ్రామానికి చెందిన దేవాంగ పురోహితుడు కొలువుల మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. ఈ నెల 20న బాపట్ల జిల్లా వేటపాలెం మండలం ఆమోదగిరి పట్నం సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహించిన ఎన్నికల్లో తనను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు మల్లికార్జునరావు సోమవారం తెలిపారు. శాస్త్రబద్ధమైన పురోహిత సేవలు అందించేందుకు కృషి చేస్తానని మల్లికార్జునరావు తెలిపారు.

ఆలయ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం: వాకతిప్పలోని కేశవ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గం సభ్యులు సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. ఆయనకు అర్చకులు, ఈఓ రాంబాబురెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఈఓ రాంబాబురెడ్డి పాలకవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. చైర్మన్‌గా గొడవర్తి వెంకటలక్ష్మి, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి రామకృష్ణ చౌదరి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, ఎంపీటీసీ సభ్యుడు కుంచె ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

వాకతిప్ప పీఏసీఎస్ పాలకవర్గం ..

కపిలేశ్వరపురం: వాకతిప్ప పీఏసీఎస్ పాలకవర్గంగా త్రిసభ్య కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. చైర్మన్‌గా గొడవర్తి సత్యనారాయణమూర్తి, సభ్యులుగా వాసంశెట్టి నాగేశ్వరరావు, దాకారపు నాగేశ్వరరావుతో పీఏసీఎస్ సీఈఓ కరుటూరి నారాయణరావు ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్ వాసంశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు కుంచె ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పడమర ఖండ్రిక పీఏసీఎస్ చైర్మన్‌గా పుత్సల

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రిక పీఏసీఎస్ చైర్మన్‌గా అంగర గ్రామానికి చెందిన పుత్సల శ్రీనివాస్ నియమితులయ్యారు. త్రిసభ్య కమిటీ సభ్యులుగా శ్రీనివాస్‌తో పాటు, సభ్యులుగా మాతా వెంకటరమణ, కర్రి పార్వతి నియమితులయ్యారు. రైతులకు సకాలంలో రుణ సదుపాయం కల్పించడం, వ్యవసాయ అనుబంధ సేవలను అందించే దిశగా కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

భక్తుల పాదయాత్ర

కపిలేశ్వరపురం (మండపేట): సాయినాథుని భక్తులు 50 మంది సోమవారం మండపేట నుంచి ద్వారపూడి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. ఏకాదశి సోమవారం సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీసాయి సత్సంగధామం ఆధ్వర్యంలో ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయంలోని సాయినాథుని ఆలయానికి పాదయాత్ర చేశారు. అనంతరం వారు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

శివారు గ్రామాల అభివృద్ధికి కృషి

కాజులూరు: నియోజకవర్గంలోని శివారు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గొల్లపాలెం పాల్యాని చెరువు జంక్షన్‌లో రూ.2.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న శలపాక, తణుకువాడ రహదారి నిర్మాణానికి సోమవారం మంత్రి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం గొల్లపాలెంలో సూర్యఘర్ పథకంలో మంజూరైన సోలార్ విద్యుత్ సిస్టంను ప్రారంభించి, గొల్లపాలెంలో ఇంటింటా పర్యటించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్లు అంగర కృష్ణ, పితాని సతీష్ కుమార్, శలపాక గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్ జైనుల్ అబెదీన్‌కు ఘన నివాళి

రామచంద్రపురం రూరల్: మొహర్రం 25వ రోజును పురస్కరించుకుని 4వ ఇమామ్ షహదత్ సందర్భంగా సోమవారం సాయంత్రం ద్రాక్షారామలోని సజ్జాదియా పంజాలో మజ్లిస్ నిర్వహించారు. జైనుల్ అబెదీన్ ఇస్లాంలో షియా 4వ ఇమామ్. మత గురువు సయ్యద్ దానిష్ అలీ నక్వీ హజరత్ అలీ జైనుల్ అబెదీన్ త్యాగాన్ని విషాద గేయం రూపంలో వివరించారు. అనంతరం పీరును మాతంతో సజ్జాదియా పంజా నుంచి ఇమాం హుస్సేన్ పంజా వరకు ఊరేగించారు. ద్రాక్షారామ, పరిసర గ్రామాలతో పాటు దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వారికి సజ్జాదియా పంజా ముజావరులు భోజన వసతి కల్పించారు.